సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



పట్టు తప్పుతున్న 'టీనేజ్'
సినిమాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం టీనేజీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మంచిని వదిలి చెడుకు ఆకర్షితులై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. 8లో



టమాట కిలో రూ.8
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.9°/13.1°
జిల్లా పరిధిలో ఆదివారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

చిత్రావతిని చెరబట్టారు!



కాలువనో, వంకనో కాదు.. ఏకంగా నదినే ఆక్రమించాడో రియల్టర్. దానిపైన పెద్ద బ్రిడ్జి కట్టేశాడు. ఇదేదో ప్రజావసరాల కోసం అనుకుంటే పొరపాటే! సొంత అవసరాల కోసం ఈ నిర్మాణం చేపట్టాడు. బ్రిడ్జి నిర్మించడమే కాదు..నదీ జలాలను అక్రమంగా వినియోగించుకుంటున్నాడు. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

- నదిని ఆక్రమించిన రియల్టర్
- చిత్రావతిపై బ్రిడ్జి నిర్మాణం
- నదీ జలాల అక్రమ వినియోగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

చిలమత్తూరు: జిల్లాలోని ప్రధాన నదుల్లో 'చిత్రావతి' ఒకటి. హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల మీదుగా ప్రవహించే ఈ నది పరివాహక ప్రాంతం రోజురోజుకూ కుంచించుకుపోతోంది. నదిలో నీటి ప్రవాహం సాఫీగా కొనసాగితే వేలాది ఎకరాలకు సాగునీరు, అనేక ప్రాంతాలకు తాగునీరు అందుతుంది. కానీ ఆక్రమణలు, అనధికారిక నిర్మాణాలు, ఇసుక తరలింపు వంటి వాటితో నది ఉనికి కోల్పోతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు చిత్రావతి పరిరక్షణకు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. చిలమత్తూరు మండలంలో రెడ్డెప్ప శెట్టి అనే వ్యక్తి చిత్రావతిని ఆక్రమించి ఏకంగా బ్రిడ్జి నిర్మించినా పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. బెంగళూరులో నివాసం ఉంటున్న రెడ్డెప్పశెట్టి ప్రముఖ రియల్టర్. ఆయనతో పాటు కుటుంబ సభ్యుల పేరిట చిలమత్తూరు మండలం మొరసలపల్లి, కోడూరు, నారేముద్దేపల్లి, మర్రిమాకులపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల భూములు ఉన్నాయి. వీటన్నింటికీ కంచె వేసుకుని పెద్ద వ్యవసాయ క్షేత్రంగా మార్చుకున్నాడు. అందులోకి బయటి వ్యక్తులెవరూ వెళ్లలేని పరిస్థితి.

అనధికారికంగా బ్రిడ్జి నిర్మాణం

చిత్రావతి నదికి ఇరువైపులా రెడ్డెప్పశెట్టి వ్యవసాయ క్షేత్రం విస్తరించి ఉంది. దీంతో నదీ పోరంబోకు భూములను సైతం తన ఆధీనంలోనే ఉంచుకున్నాడు. సుమారు 19 ఎకరాలను ఆక్రమించుకుని కంచె వేయడంతో పాటు కోడూరు సమీపంలో నదిపై బ్రిడ్జి నిర్మించి రాకపోకలు సాగిస్తున్నాడు. సాధారణంగా నదులపై బ్రిడ్జీల నిర్మాణం ఆషామాషీ వ్యవహారం కాదు. ఉన్నతస్థాయిలో అనుమతులు తీసుకోవాలి. అదీ ప్రజావసరాలకు తప్ప వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎలాంటి అనుమతులూ ఇవ్వరు. కానీ ఇక్కడ స్థానిక అధికారులను లోబరుచుకుని అక్రమ నిర్మాణం చేపట్టారు. అతని 'సామ్రాజ్యం'లోకి వెళ్లేందుకు సామాన్యులకు అవకాశం ఉండదు. చుట్టూ కంచె ఉండటంతో అటుగా వెళ్లేందుకు ఎవరూ సాహసించరు. ఇదే అదనుగా అక్రమ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు స్పష్టమవుతోంది.

నదీ జలాల మళ్లింపు

బ్రిడ్జి నిర్మాణంతోనే ఆగకుండా నదిలో చెక్‌డ్యాంలు కట్టి.. వ్యవసాయ క్షేత్రంలోని పెద్దపెద్ద ఫారం పాండ్లకు నీటిని మళ్లించుకుంటున్నారు. చెరువులకు వచ్చే నీటి దారులను ఫారం పాండ్లకు మళ్లించారు. ఫలితంగా దిగువ ప్రాంతానికి నీరు రావడం లేదు. రెడ్డెప్పశెట్టి అరాచకాలపై పలు గ్రామాల రైతులు అధికారులకు ఫిర్యాదులు చేసినా..ఏమాత్రమూ పట్టించుకోలేదు. పైగా అతనికే అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

బ్రిడ్జి నిర్మాణం కోసం అనుమతి తీసుకోలేదు

చిత్రావతిపై అక్రమంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టారని మా దృష్టికి వచ్చింది. ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. అదీ ప్రజలకు అవసరం అనుకుంటేనే అనుమతులు మంజూరు చేస్తాం. ప్రజావసరాలు లేనప్పుడు నదిపై బ్రిడ్జి నిర్మించడం తప్పు. హద్దులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ వారికి లేఖ రాశాం. అయినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మళ్లీ లేఖ రాస్తాం. మేము నేరుగా చర్యలు చేపట్టడానికి లేదు. రెవెన్యూ వాళ్లే తీసుకోవాలి.

– యోగానంద, ఇరిగేషన్ డీఈ

న్యూస్‌రీల్


రాత్రివేళల్లో ముమ్మర గస్తీ



బుక్కపట్నం స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

పుట్టపర్తి టౌన్: అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట, చోరీల నియంత్రణ కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసులు రాత్రివేళ ముమ్మరంగా గస్తీ, వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై ప్రత్యేక డ్రైవ్‌లో కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్‌చేసిన వారిపై కేసులు పెడుతున్నారు. హెల్మెట్ వినియోగం, నిద్రమత్తు పోయేలా ఫేస్ వాష్‌పై అవగాహన కల్పిస్తున్నారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా, నాటుసారాలపై దాడులు చేస్తున్నారు. గ్రామాలను సందర్శించి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు.

కొత్త ఫాస్టాగ్ రూల్స్ తప్పనిసరి



హిందూపురం అర్బన్: జాతీయ రహదారులు, ఇతర చోట్ల టోల్‌గేట్స్ దాటి వెళ్లే వాహనదారులు (కార్లు, బస్సులు, లారీలు తదితర వాహనాలు) తప్పనిసరిగా సోమవారం నుంచి నూతన ఫాస్టాగ్ రూల్స్ పాటించాలి. ఈ నెల 17 నుంచి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త ఫాస్టాగ్ రూల్స్ అమలులోకి తెచ్చింది. ఈ విధానం ప్రకారం వాహనదారులు కొత్త చెల్లింపు విధానాలు పాటించకపోతే అదనంగా ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానంగా టోల్ ప్లాజా వద్దకు వెళ్లే 75 నిమిషాల ముందే తగిన రెండింతల మొత్తం ఫాస్టాగ్‌లో ఉండేలా రీచార్జ్ చేసుకోవాలి. అలాగే రవాణా కార్యాలయంలో కేవైసీ చేయించుకొని తీరాలి. కొంతమంది ఇప్పటికీ అడపాదడపా వాహనాలు బయటకు తీసి తిప్పేవారు టోల్ ప్లాజా వద్దకు వెళ్లేందుకు 5 నిమిషాల ముందు రీచార్జ్ చేస్తుంటారు. ఇకమీదట అలా కుదరదు. అందుకు జాతీయ రహదారుల అధీకృత సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) స్వస్తి పలికింది. తగిన మొత్తం ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేని పక్షంలో డబుల్ మొత్తం చెల్లించక తప్పదు. త్వరిత గత ప్రయాణం, డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు ప్రోత్సహించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఈ నిబంధనను సోమవారం తెల్లవారుజాము నుంచి అమల్లోకి తీసుకొచ్చింది.

ఏటి గంగమ్మా.. చల్లంగ చూడమ్మా



విశేష అలంకరణలో ఏటి గంగమ్మ

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన ఏటి గంగమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగాయి. జిల్లా నలమూలల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ముందుగా భక్తులు పెన్నహోబిళంలో లక్ష్మీనృసింహస్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పవిత్ర పెన్నా నదిలో మాఘమాస పుణ్యస్నానాలు ఆచరించారు. నది సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయంలో ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి కోళ్లు, గొర్రెలు, మేకలు బలి ఇచ్చి పచ్చని చెట్ల మధ్య వనభోజనాలు చేశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ యువనేత వై.భీమిరెడ్డి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు వనజాక్షి, ఆకుకూర నాగరాజులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెన్నహోబిలం ఆలయ ఈఓ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

నేడు ఎస్పీ కార్యాలయంలో 'పరిష్కార వేదిక'

పుట్టపర్తి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎస్పీ సూచించారు.

జీబీఎస్‌పై ఆందోళన వద్దు

పుట్టపర్తి అర్బన్: జీబీఎస్ (గిలన్ బారీ సిండ్రోమ్)పై ఆందోళన అవసరం లేదని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం పేర్కొన్నారు. రోగ నిరోధక వ్యవస్థ పరిధిలోని నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో కండరాల బలహీనత ఏర్పడే వ్యాధి జీబీఎస్ అని వివరించారు. ఇది చాలా అరుదైన వ్యాధని, ఇది అంటువ్యాధి కాదని తెలిపారు. వైరస్, బ్యాక్టీరియాల సంక్రమణ అనంతరం ఇది వస్తుందని వెల్లడించారు. వ్యాధి లక్షణాలు వేగంగా తీవ్రమవుతాయన్నారు. చూడడానికి అంతా ఆరోగ్యంగానే ఉంటూ రక్త పరీక్షల్లో నాడీ, రక్త పోటు నార్మల్ గానే కనిపిస్తాయన్నారు. దేశంలో మొదటి కేసు పూనేలో నినిర్ధారణ అయ్యిందని, జిల్లాలో ఇంత వరకూ ఒక్కటీ నమోదు కాలేదని తెలిపారు.

వ్యాధి లక్షణాలు

నరాల బలహీనతతో కాళ్లు, చేతులు, చచ్చుబడడం, గొంతు పొడి బారడం, ఆహారం తీసుకోలేకపోవడం జరుగుతాయని డీఎంహెచ్ఓ తెలిపారు. ఇందుకు పలు జాగ్రత్తలను సూచించారు. కాళ్లు, చేతులు తరచూ శుభ్రం చేసుకుంటూ ఉండాలని, ముఖ్యంగా పబ్లిక్ టాయిలెట్స్ వాడినప్పుడు, సమూహాల్లో ఉన్నప్పుడు చేతులు శుభ్రం చేసుకుంటూ ఉండాలన్నారు. అసాధారణ నీరసం, కాళ్లు చేతులు తిమ్మిర్లు ఉన్నప్పుడూ, ఫ్లూ జ్వరం లక్షణాలు ఉన్నప్పుడు, మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు జ్వరం ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. రోగ నిరోధక శక్తి పెంచడానికి ఇమ్యునో గ్లోబిన్ ఇంజెక్షన్ ఇస్తారని తెలిపారు.

కదులుతున్న బస్సు.. కిటికీలో కాళ్లు



గుత్తి రూరల్: పూటుగా మద్యం సేవించి ఆర్టీసీ బస్సు ఎక్కిన ఓ వ్యక్తి.. బస్సు కదిలాక కిటికీలో నుంచి కాళ్లు బయటకు పెట్టి దర్జాగా నిద్రపోయాడు. ఆదివారం సాయంత్రం గుత్తి నుంచి అనంతపురం వెళ్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆఖరి సీటులో కూర్చున్న మందుబాబు బస్సు కిటికీలో నుంచి తన రెండు కాళ్లు బయటకు పెట్టి నిద్రించి ప్రయాణించాడు. ఈ విషయాన్ని ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరలైంది. దీనిపై పలువురు నెటిజన్లు సెటైర్లు పేల్చారు. 'మీకు పూర్తిగా కిక్ ఇస్తా, కంపెనీలతో మాట్లాడి నాణ్యమైన మద్యం అందిస్తా' అంటూ గతంలో సీఎం చంద్రబాబు మాట్లాడిన మాటలను ఈ సందర్భంగా ఓ వ్యక్తి గుర్తు చేశారు. 'కూటమి ప్రభుత్వానికి విద్య, వైద్యం మీద శ్రద్ధ లేదనడానికి ఉదాహరణ ఇది' అంటూ ఒకరు.. 'కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విచ్చలవిడిగా బెల్ట్ షాపుల రూపంలో మద్యం దొరుకుతోంది. నేడు ఆరోగ్యం బాగాలేదని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే అక్కడ మందులు దొరుకుతాయో లేదో తెలియదు కానీ ఊరూరా బెల్టు దుకాణాల్లో మద్యం మాత్రం దొరుకుతోంది. చంద్రబాబు చెబుతున్న మంచి ప్రభుత్వం అంటే ఇదే' అంటూ మరొకరు కామెంట్ చేశారు.

రాజుకున్న భూ వివాదం



ధ్వంసమైన ప్రహరీ



బాధితుడు ప్రభాకర్

- పల్లె అనుచరుడిపై దాడి
- పొలంలో ఫెన్సింగ్, ప్రహరీ కూల్చివేత

పెనుకొండ రూరల్: కియా కార్ల తయారీ పరిశ్రమ సమీపంలో భూ వివాదాలు రాజుకుంటున్నాయి. రెండు వారాల కిందట స్వల్ప వివాదం చోటు చేసుకుంది. తాజాగా ఆదివారం భూ సమస్యతో ఒక వర్గంపై మరో వర్గం దాడికి తెగబడింది. వివరాలిలా ఉన్నాయి. టీడీపీ నేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అనుచరుడు, గుంతకల్లుకు చెందిన ప్రభాకర్‌కు మునిమడుగు పొలం సర్వే నంబర్ 433లో 1.12 ఎకరాలు, గుట్టూరు పొలం సర్వే నంబర్ 324లో 61 సెంట్ల భూమి ఉంది. దీనికి ఫెన్సింగ్ వేసి.. ఆదివారం చదును చేయిస్తున్న సమయంలో బీజేపీకి చెందిన ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ అనుచరులు సాయితేజ, వీరాంజనేయులు, బోయ వినోద్‌కుమార్ మరికొందరు అక్కడికి చేరుకుని వాగ్వాదానికి దిగారు. ఇక్కడ ఎనిమిది సెంట్ల స్థలం ఎంపీపీకి చెందినది ఉందంటూ ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారు. జేసీబీతో ప్రహరీని కూలదోశారు. అడ్డుకోబోయిన ప్రభాకర్‌పై ఇనుప రాడ్లు, కట్టెలు, కొడవళ్లతో దాడి చేశారు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కేకలు వేయడంతో ఎంపీపీ అనుచరులు అక్కడి నుంచి ఉడాయించారు. అనంతరం బాధితుడు ఘటనపై కియా ఏరియా పోలీస్ స్టేషన్ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారమందించాడు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని, ఎంపీపీ నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరానన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. ఘటనకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, మరికొంతమంది పరారీలో ఉన్నారని చెప్పారు.

పెళ్లి చేయలేదని యువకుడి హల్‌చల్

- సెల్‌టవర్ ఎక్కి దూకుతానని బెదిరింపు
- చాకచక్యంగా కాపాడిన పోలీసులు



సెల్‌టవర్ నుంచి కిందకు దిగివచ్చిన రంగప్పతో మాట్లాడుతున్న పోలీస్

నల్లమాడ: పెళ్లి చేయలేదని అలిగిన ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. సెల్‌టవర్ ఎక్కి దూకేస్తానని బెదిరింపులకు దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చాకచక్యంతో అతడిని కిందకు దింపి ప్రాణాలు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. రెడ్డిపల్లికి చెందిన రంగప్ప అనే యువకుడు పూటుగా మద్యం తాగి ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో సమీపంలోని రిలయన్స్ సెల్ టవర్ ఎక్కాడు. తల్లిదండ్రులు తనకు పెళ్లి చేయడం లేదని, టవర్‌పై నుంచి దూకి చనిపోవాలని ఉందని బిగ్గరగా అరిచాడు. సమాచారం అందుకున్న నల్లమాడ సీఐ వైనరేంద్రరెడ్డి వెంటనే అప్రమత్తమై ఓడీ చెరువు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గ్రామస్తుల సహకారంతో రెండు గంటల పాటు శ్రమించి యువకుడికి నచ్చజెప్పి సెల్ టవర్ నుంచి కిందకు దిగేలా చర్యలు తీసుకున్నారు. యువకుడికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. సకాలంలో స్పందించి నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులను ఎస్పీ రత్నతో పాటు గ్రామస్తులు అభినందించారు.

17 నుంచి కార్మికుల సమ్మె

హిందూపురం టౌన్: ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న కార్మికులు ఈ నెల 17న అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ నాయకులు, నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయి స్కీమ్ వర్కర్స్ యూనియన్ కార్మికులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే బాలకృష్ణ స్వగృహంలో పీఏకు సమ్మె నోటీసును అందజేశారు. వారు మాట్లాడుతూ పెనుకొండ పరిధిలో ఉన్న కార్మికులకు 10 నెలల వేతనాలు, 32 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలన్నారు. హిందూపురం పరిధిలో ఉన్న కార్మికులకు 10 నెలల వేతనాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించాలన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి రాము, యూనియన్ అధ్యక్షుడు సోమశేఖర్, ఆర్గనైజర్ మురళీ, కార్యదర్శి గిరీష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదవి ఒకరిది.. పెత్తనం మరొకరిది

- పుట్టపర్తి, హిందూపురం, మడకశిరలో వింత పరిస్థితులు
- షాడో ఎమ్మెల్యేల తీరుతో తలలు పట్టుకుంటోన్న అధికారులు
- ధర్మవరం, రాప్తాడులో పరిటాల శ్రీరామ్ అనుచరుల హల్‌చల్
- అధికారులతో సమీక్షలు నిర్వహించి అడ్డదిడ్డంగా ఆదేశాలు జారీ



ఈ నెల 6న కలెక్టరేట్‌లో సమావేశానికి హాజరైన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



మడకశిరలో 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి పదవి ఒకరిది.. పెత్తనం మరొకరిది. ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరు – ముగ్గురు నాయకులు ఎమ్మెల్యే తరహాలో పెత్తనం చెలాయిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పుట్టపర్తి, మడకశిర, హిందూపురంలో ప్రజలకు వింత పరిస్థితులు ఎదురవుతూనే ఉన్నాయి. ఎన్ని విమర్శలు వచ్చినా.. ఎమ్మెల్యే కాకపోయినా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను పక్కకు నెట్టి.. షాడోలు హవా సాగిస్తుండటం గమనార్హం.

ఉనికి కోసం ఆరాటం

గడిచిన ఎన్నికల్లో టికెట్ రాలేదు. ప్రజలు మరిచిపోకుండా ఉండాలంటే నిత్యం జనాల్లో ఉంటూ ఉనికి చాటుకోవాలనే క్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి షాడో ఎమ్మెల్యే అవతారమెత్తారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కంటే ఆమెకు మామ అయిన పల్లె రఘునాథరెడ్డి ప్రతి విషయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఎమ్మెల్యే హోదాలో నేరుగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గానికి వచ్చిన కొత్త అధికారులు కూడా ఆయనను భేటీ అయి శాలువా కప్పి సన్మానం చేస్తుండటం విశేషం.

మడకశిరలో మాజీ ఎమ్మెల్సీ హవా

ఎస్సీ రిజర్వుడు స్థానమైన మడకశిరలో పెత్తందారుడు అయిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హవా సాగిస్తున్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు లేకున్నా.. ఆయన స్థానంలో గుండుమల ఉంటూ ఆదేశాలు ఇస్తుండటం గమనార్హం. టీడీపీ తరఫున ఎమ్మెల్యే ఎవరైనా.. పెత్తనం మాత్రం గుండుమలదే అన్న చందంగా మడకశిరలో పాలన తయారైంది. అధికారుల బదిలీలు, పాలనా వ్యవహారాలతో పాటు కార్యకర్తలతో నిత్యం టచ్‌లో ఉంటూ ఎమ్మెల్యే హోదాలో అధికారం చెలాయిస్తున్నారు.

హిందూపురంలో బాలయ్య పీఏలదే పెత్తనం

సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినిమా షూటింగుల్లో బిజీగా ఉండటంతో హిందూపురం నియోజకవర్గంలో ఆయన మార్కు లేదనే చెప్పాలి. చుట్టపుచూపుగా వస్తూ రిబ్బన్ కటింగ్ కార్యక్రమాల్లో ఫొటోలకు ఫోజులు ఇచ్చి వెళ్తుంటారు. అయితే షాడో ఎమ్మెల్యేల తరహాలో ఆయన పీఏలు ఇక్కడ రాజ్యమేలుతున్నారు. గత పదేళ్లుగా హిందూపురంలో ఇలాంటి పరిస్థితే దాపురించింది.

ధర్మవరంలో శ్రీరామ్ చక్రం

ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ ఉన్నప్పటికీ.. చాలా విషయాల్లో టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ జోక్యం చేసుకుంటున్నారు. అధికారులను బదిలీలు చేయిస్తానని.. తాను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి హోదాలో ఉన్నానని చెబుతూ పెత్తనం చెలాయిస్తున్నారు. అంతేకాకుండా బీజేపీ తరఫున హరీష్‌బాబు, జనసేన నుంచి చిలకం మధుసూదన్‌రెడ్డి.. ఎవరికి వారుగా షాడో ఎమ్మెల్యే అవతారమెత్తి అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఇక రాప్తాడులో పరిటాల సునీత ఎమ్మెల్యే అయినప్పటికీ.. అక్కడ ఆమె కుటుంబ సభ్యులే పెత్తనం చెలాయిస్తున్నారు.

కలవరపెడుతోన్న ఐవీఆర్ఎస్ సర్వే

టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా పార్టీల నేతలు ఎవరికి వారుగా ప్రజాక్షేత్రంలో ఉనికి చాటేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై చంద్రబాబు ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) నిర్వహిస్తుండటం కలవరపెడుతోంది. పరిటాల శ్రీరామ్, కందికుంట ప్రసాద్, పల్లె రఘునాథరెడ్డి, గుండుమల తిప్పేస్వామి వ్యవహార శైలిపై పలువురికి ఫోన్ కాల్స్ వచ్చాయి. దీనిపై కూటమి పార్టీలోని కొందరు నాయకుల కుట్ర ఉందని సొంత పార్టీ నేతలే చర్చించుకోవడం విశేషం. ధర్మవరంలో పరిటాల శ్రీరామ్ ప్రాబల్యం తగ్గించేందుకు కందికుంట ప్లాన్ వేశారని తెలిసింది.

శ్రవణానందభరితంగా సంగీత విభావరి



సంగీత విభావరి నిర్వహిస్తున్న ఎంబార్ కన్నన్, సత్యనరవనన్‌ల బృందం

ప్రశాంతి నిలయం: మృదు మధురమైన స్వరాలొలికిస్తూ నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత విభావరి శ్రవణానందభరితంగా సాగింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత అతి రుద్రమహాయజ్ఞం నాలుగో రోజు ఆదివారం కొనసాగింది. వేదపండితులు వేదపఠనం నడుమ యజ్ఞ క్రతువులు నిర్వహించారు. సంస్కృత ఉపన్యాసకులు డాక్టర్ రామరత్నం అతిరుద్ర మహాయజ్ఞాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. పిదప కలైమణి ఎంబార్ కన్నన్, కలైమణి సత్యనరవనన్‌ల బృందం ఆధ్యాత్మిక భక్తిరస సంగీత విభావరి నిర్వహించారు పిదప భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.



అతిరుద్ర మహాయజ్ఞం క్రతువులు నిర్వహిస్తున్న వేదపండితులు

క్లుప్తంగా

ద్విచక్ర వాహనానికి నిప్పు

హిందూపురం అర్బన్ : మండల పరిధిలోని మోత్కుపల్లిలో శనివారం రాత్రి తిప్పన్న అనే వ్యక్తి చెందిన ద్విచక్ర వాహనానికి దుండగులు నిప్పుపెట్టారు. దీంతో వాహనం కాలిబూడిదైంది. ఈ ఘటనపై బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ధర్మవరం అర్బన్: పట్టణంలోని కదిరిగేటు సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. 35 నుంచి 40 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి రోడ్డు పక్కన మృతి చెందాడన్నారు. మృతుని ఆచూకీ తెలిస్తే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

నరబలి కేసులో ఇద్దరి అరెస్ట్

పావగడ: నరబలి కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలమేరకు.. పశ్చిమ దిక్కుకు వెళ్లి నరబలి ఇస్తే నిధులు దొరుకుతాయని తాలూకాలోని కోటగుడ్డకు చెందిన జ్యోతిష్కుడు రామకృష్ణ... కుందిర్పి మండలానికి చెందిన ఆనందరెడ్డికి చెప్పాడు. దీంతో ఈ నెల 9న పావగడ నుంచి పడమటి దిక్కుగా ఉండే చళ్లకెరె తాలూకా పరశురాంపురం గ్రామానికి ఆనందరెడ్డి వెళ్లాడు. పక్కా ప్లాన్ ప్రకారం స్థానిక బస్టాండ్‌లో చెప్పులు కుట్టే చర్మకారుడు ప్రభాకర్‌తో మాట కలిపాడు. అతను పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా తానూ అదే దారిలో వెళ్తున్నానని.. ఇంటి వద్ద విడిచిపెడతానని నమ్మబలికాడు. మార్గ మధ్యలో నిందితుడు ఆనందరెడ్డి వెంట తెచ్చుకున్న మచ్చు కత్తితో ప్రభాకర్‌పై దాడి చేయడంతో అతను చనిపోయాడు. విచారణ అనంతరం పోలీసులు జ్యోతిష్కుడు రామకృష్ణ , కుందిర్పి ఆనందరెడ్డిని అరెస్ట్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 22 వరకూ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆమిద్యాలలో భారీ చోరీ

- 20 తులాల బంగారు, రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు



బీరువా పగలగొట్టిన దృశ్యం

ఉరవకొండ: మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు ఇంట్లో బీరువాలోని 20 తులాల బంగారుతో పాటు రూ1.50 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. ఆమిద్యాలకు చెందిన దర్జీ నారాయణరావు, సర్వసతీ దంపతులు 10 రోజుల క్రితం వైద్య పరీక్షలు చేయించుకోవడానికి బెంగళూరుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా ధ్వంసం చేసి 20 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.1.50 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు కేసు నమోదు చేసుకొని క్లూస్‌టీం సహాయంతో వేలిముద్రలను సేకరించారు.

లేపాక్షి మండలానికి చెందిన ఓ యువకుడు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ బెంగళూరులో ఉంటున్నాడు. జీతం బాగానే ఉండటంతో తమ బిడ్డను ఇస్తే బాగా చూసుకుంటాడని భావించిన హిందూపురం పట్టణానికి చెందిన యువతి తల్లిదండ్రులు అతనికిచ్చి రెండేళ్ల క్రితం వివాహం చేశారు. కొద్దిరోజులు వారి సంసారం సవ్యంగా సాగినా.. ఉన్నట్టుండి పిడుగులాంటి విషయం బయట పడింది. ఆ యువకుడు మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని తెలిసింది. దీంతో పెద్దలు కౌన్సిలింగ్ ఇప్పించారు. మార్పులేకపోవడంతో చేసేదిలేక ఆ యువతి అతని నుంచి విడిపోయింది.

హిందూపురానికి చెందిన యువతీ, యువకులు బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసేవారు. ఈ నేపథ్యంలోనే వారి పరిచయం కాస్తా ప్రేమగా మారింది. కులాలు వేరైనా ఇద్దరు చదువుకొన్నవారే కావడం.. చెప్పినా వినే పరిస్థితి లేకపోవడంతో చేసేది లేక ఏడాదిన్నర క్రితం రెండు కుటుంబాలు పిల్లల సంతోషం కోసం పెళ్లి చేశారు. ఇరువురు సంపాదన చేసే వారే కావడం.. వారిలో అహం పెరగడంతో ఏడాదిన్నర తిరక్కుండానే విభేదాలు వచ్చి దూరమయ్యారు. కొంత కాలం ఈ విషయం రెండు కుటుంబాలకు తెలియకుండా రహస్యంగా ఉంచారు. తరువాత వెలుగులోకి వచ్చి నచ్చజెప్పినా.. పోలీసులతో కౌన్సిలింగ్ ఇప్పించినా విడిపోవడంతో ఆ రెండు కుటుంబాల్లో మనోవేదన మిగిలిచ్చింది.



పట్టుతప్పుతున్న టీనేజ్

టీనేజీ పట్టు తప్పుతోంది. సినిమాలు కూడా విపరీతంగా ప్రభావితం చేస్తుండటంతో యువతీ యువకులు చేస్తున్న తప్పులతో కుటుంబాలే కాదు వారి జీవితాలు కూడా దెబ్బతింటున్నాయి. వివాహమైన తక్కువ వ్యవధిలోనే విభేదాల కారణంగా పోలీసుస్టేషన్లు, కోర్టు మెట్లు ఎక్కుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది.

- సినిమాలు, సామాజిక మాధ్యమాలతో యువత పెడదారి
- పెళ్లైన తక్కువ వ్యవధిలోనే విడాకుల బాట
- పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ ప్రదక్షిణ
- కుటుంబాలకు మనోవేదన మిగుల్చుతున్న వైనం

హిందూపురం అర్బన్: పాతిక ఏళ్ల క్రితం వరకూ తల్లిదండ్రుల అడుగు జాడల్లోనే ఎక్కువ మంది పిల్లలు నడిచేవారు. పెళ్లిళ్లు సైతం ఎక్కువ భాగం తల్లిదండ్రులు నిశ్చయించిన విధంగానే జరిగేవి. పెళ్లిళ్ల తరువాత ఏవైనా సమస్యలు వస్తే రెండు కుటుంబాలు కూర్చొని తమ పిల్లలకు సర్దిచెప్పి వారి మధ్య మనస్పర్థలను తొలగించి భార్యాభర్తలను ఒకటి చేసేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.

వందలో 30 కేసులు

అగ్ని సాక్షిగా జీవితాంతం కలిసి ఉంటామని ఒక్కటవుతున్న ఎన్నో జంటలు .. పెళ్లైన ఆరు నెలలు, ఏడాది గడవక ముందే మనస్పర్థలతో గొడవలకు దిగుతున్నారు. ఇద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉన్నా సంపాదన ఉండటంతో నువ్వెంత అంటే నువ్వెంత అంటూ వాదనలకు దిగుతున్నారు. ఒకరి నిర్ణయాలను ఒకరు గౌరవించక పోవడం, మొండిగా వ్యవహరిస్తుండటంతో చివరకు విడాకుల దాకా వచ్చి దూరమై పోతున్నారు. వందలో 30 వరకూ ఇలాంటి కేసులే పోలీసుస్టేషన్లకు వస్తున్నాయి.పెద్దలు నచ్చ జెప్పే ప్రయత్నాలకే అవకాశమే ఇవ్వడం లేదు. దీంతో ఆయా కుటుంబాలు నలిగిపోతున్నాయి.

చిన్న వయసులోనే ప్రేమ వ్యవహారాలు

ఎక్కువ మంది తల్లిదండ్రులు సంపాదనపై దృష్టి పెట్టడం, పిల్లలను పట్టించుకోక పోవడం వారు వేరే వారికి ఆకర్షితులవుతుండటంతో ఇబ్బందులొస్తున్నాయి. దీనికితోడు సినిమాలు, సామాజిక మాధ్యమాలు, ఓటీటీలు, సీరియళ్ల ప్రభావం యువత మనసుల్లో విషబీజాలు నాటుతున్నాయి. హైస్కూల్, ఇంటర్ చదివే వయస్సు నుంచే ప్రేమ వ్యవహారాలు ప్రారంభమై పక్కదారి పడుతున్నాయి.

ప్రేమ పేరుతో పెడదారి



ప్రేమ, పెళ్లి అంటూ ఎంతో మంది యువతీ యువలు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దీనివల్ల అన్యోన్యంగా ఉండాల్సిన కుటుంబాల్లో అలజడి రేగుతోంది. సంపాదనలో ఇరువురు తీసిపోకపోవడం, తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వక పోవడం, ఇరువురిలో అహం పెరగడం, అత్తమామలు, ఆడపడుచులు ఉన్నారన్న సాకులతో ఎక్కువ జంటలు విడిపోతున్నాయి. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ మంచి, చెడ్డలను వివరించి వివాహ వయసు రాగానే మంచి సంబంధం చూసి పెళ్లి చేయడం మేలు.

– రాజగోపాల్‌నాయుడు, పట్టణ సీఐ, హిందూపురం

మెట్టినింటికి తీసుకెళ్లాలని అడిగినందుకు దాడి

- న్యాయం చేయాలంటున్న బాధితురాలు

బెళుగుప్ప: మెట్టినింటికి తీసుకెళ్లాలని అడిగినందుకు భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులు చితకబాదారని బాధితురాలు సాయిలీల ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ శివ విచారణ చేపట్టారు. బాధితురాలి వివరాలమేరకు.. మండల పరిధిలోని తగ్గుపర్తికి చెందిన సాయిలీల, కణేకల్లు మండలం కలేకుర్తికి చెందిన లాలుస్వామి మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెద్దల అంగీకారంతో గత నెల 24న పెళ్లి కూడా చేసుకున్నారు. అయితే తగ్గుపర్తిలోని తన అక్క ఇంట్లో ఉంటున్న లాలుస్వామి.. భార్య సాయిలీల దగ్గరకు మాత్రం అప్పుడప్పుడూ వెళ్లేవాడు. అయితే మెట్టినింటికి తీసుకెళ్లాలని సాయిలీల భర్త లాలుస్వామిని అడిగింది. తన అక్కలకు, అమ్మకు తనను పెళ్లిచేసుకోవడం ఇష్టం లేదని చెప్పాడని, మెట్టినింటికి తీసుకెళ్లాలని గట్టిగా నిలదీసింది. ఈ నేపథ్యంలో సాయిలీలతో పాటు ఆమె అక్క ప్రవళ్లిక, అన్న ఎర్రిస్వామి, వదిన శిల్ప, మామ నాగరాజుపై లాలుస్వామితో పాటు వారి కుటుంబ సభ్యులు దాడి చేశారు. వారంతా గాయపడటంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులే తనకు న్యాయం చేయాలని బాధితురాలు సాయిలీల విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



లారీ చక్రాల కింద ఇరుక్కుపోయిన రంగనాయకులు

తాడిపత్రి రూరల్: మండలంలోని సజ్జలదిన్నె క్రాస్‌లో ఆదివారం రంగనాయకులు(65) ద్విచక్ర వాహనంలో వెళ్తూ లారీ కింద పడి మృతి చెందినట్లు అప్‌గ్రేడ్ ఎస్‌ఐ కాటయ్య తెలిపారు. మండలంలోని ఆలూరుకు చెందిన రంగనాయకులు మోటర్ సైకిల్‌లో తాడిపత్రి నుంచి ఆలూరుకు వెళుతుండగా ప్రమాదం జరిగిందన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

గార్లదిన్నెలో మరొకరు..

గార్లదిన్నె: మండల పరిధిలోని రామ్‌దాస్‌పేట గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... శింగనమల మండలం నిదనవాడకు చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి లాగేజీ ఆటోలో గేదేలను అనంతపురం మార్కెట్‌కు తరలిస్తున్నాడని చెప్పారు. అయితే రామ్‌దాస్‌పేట సమీపంలోకి రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆటో బోల్తా పడిందన్నారు. దీంతో లక్ష్మీనారాయణ (45) అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురము ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వందశాతం ప్రగతి సాధించాలి



ఎస్ఎన్‌సీయూ విభాగంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

హిందూపురం టౌన్: ప్రాథమిక, అర్బన్, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో అన్ని పారామీటర్లలో నూరుశాతం ప్రగతి సాధించాలని వైద్యాధికారులకు డీఎంహెచ్‌ఓ ఫైరోజ బేగం సూచించారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని పీపీ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాసరెడ్డితో పాటు పీహెచ్‌సీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. అలాగే ప్రభుత్వాస్పత్రిలోని కాన్పుల వార్డు ఎస్ఎన్‌సీయూ విభాగాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. అలాగే పరిగి రోడ్డులోని ఆర్‌కే నర్సింగ్ హోమ్‌ను సందర్శించి పీసీపీఎన్‌డీటీ రిపోర్టులను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ ఫైరోజ బేగం మాట్లాడుతూ ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, అనవసర మందులు ఉపయోగించి అనర్థాలు తెస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుతో పాటు ఆర్ఎంపీలు వైద్యం అందించే కేంద్రాల్లో తగిన చర్యలు తీసుకోవడానికి జిల్లా వ్యాప్తంగా 14 మంది వైద్యులతో ఏడు కమిటీలను ఇదివరకే నియమించామన్నారు. ఆర్ఎంపీలు పేరుకు ముందు 'డాక్టర్ 'అని' క్లినిక్' అని బోర్డులలో ఉండకూడదని, కేవలం ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ఉండేలా చూడాలన్నారు. హద్దుమీరి వైద్యం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌సీడీ సర్వేలో జిల్లాలో లక్ష్మీపురం ఆరోగ్య కేంద్రం చివరి స్థానంలో ఉండడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు పద్మజ, ఆనంద్‌బాబుతో పాటు పరిసర పీహెచ్‌సీ వైద్యులతో బాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా స్థాయి సీనియర్ ఉమెన్ హ్యాండ్‌బాల్ జట్టుతో అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం: జిల్లాస్థాయి జూనియర్ బాయ్స్, సీనియర్ ఉమెన్ హ్యాండ్‌బాల్ జట్లను ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు రియాజ్ తెలిపారు. పట్టణంలోని యశోద పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి జూనియర్ బాయ్స్, సీనియర్ ఉమెన్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యశోద పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, వైఎస్ఎల్ ఎంటర్ ప్రైజెస్ చంద్రశేఖర్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రియాజ్, కార్యదర్శి సాకే శివశంకర్ జట్లను ఎంపిక చేశారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో కర్నూల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు.

బాలుర జట్టు:

సాయికిరణ్, హరినాథ్‌బాబు, వినయ్, సిద్విక్, ప్రసాద్ నాయక్, జశ్వంత్, నాగ మహేష్, ధనుష్, వినోద్ నాయక్, సాంబ, అశ్విన్ చౌదరి, రోహిత్, వినీత్‌రెడ్డి, కార్తీక్‌నాయక్, అశోక్, లోకేష్

సీనియర్ మహిళా జట్టు:

ధనూషా, గీతిక, లాస్య, లిఖిత, తన్మయి, రిషిక, ధనలక్ష్మి, హర్షవల్లి, మహేశ్వరి, మంజుల, మహిత, కీర్తి, హర్షప్రియ, తేజశ్విని, మెహరున్నీసా, మధుమతి

సందడిగా రాతి దూలం పోటీలు



దూలాన్ని లాగుతున్న ఎద్దులు

గుత్తి రూరల్: మండల పరిధిలోని తొండపాడులోని బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న రాతిదూలం లాగుడు పోటీలు రెండోరోజు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం ఆరు, ఆరుపళ్ల విభాగంలో వృషభాల పోటీలు పోటాపోటీగా జరిగాయి. గ్రామంలో జరుగుతున్న పోటీలలో కర్నూలు జిల్లా తాండ్రపాడు గ్రామానికి చెందిన చిన్న రత్నం వృషభాలు 5.135 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.35 వేలు గెలిచాయి.

చెత్త విషయంలో డిష్యూం.. డిష్యూం



తీవ్రంగా గాయపడిన సాయమ్మ, వంశీ, రసూల్

గుత్తి: చెత్త పడేసి విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం గుత్తి ఆర్ఎస్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రసూల్-సాయమ్మ ఇళ్లు పక్క పక్కనే ఉన్నాయి. అయితే చెత్త పడేసే విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో రెండు కుటుంబానికి చెందిన వారు కత్తులు, కట్టెలతో పరస్పరం దాడులు దిగారు. ఈ ఘటనలో తల్లీ కొడుకు వంశీ, సాయమ్మ , రసూల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'మిస్టర్ సౌత్ ఇండియా' పోటీల్లో ప్రతిభ



బాడీ బిల్డర్ కొలిమి దస్తగిరి

రాయదుర్గంటౌన్: బెంగళూరులో ఆదివారం జరిగిన మిస్టర్ సౌత్ ఇండియా మెన్స్ ఫిజిక్ బాడీ బిల్డింగ్ పోటీల్లో అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణానికి చెందిన యువకుడు కొలిమి దస్తగిరి మూడో స్థానం సాధించారు. ఆయన మొదటిసారిగా ఈవెంట్‌లో పాల్గొని ఈ ఘనత సాధించారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అనేక మంది బాడీబిల్డర్లు పాల్గొనగా మన రాష్ట్రం నుంచి పాల్గొన్న ఏకైక పోటీదారుడు దస్తగిరి కావడం విశేషం. మొత్తం 60 మంది పోటీల్లో పాల్గొనగా దస్తగిరి మూడోస్థానాన్ని దక్కించుకున్నాడు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మున్ముందు రాష్ట్రం నుంచి మరిన్ని పోటీల్లో పాల్గొంటానని దస్తగిరి పేర్కొన్నారు.

కుంభమేళాకు వెళ్లిన తాడిపత్రి వాసులకు గాయాలు



ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు

తాడిపత్రిటౌన్: పట్టణం నుంచి కుంభమేళాకు వెళ్లిన తాడిపత్రి వాసులు ఆదివారం ప్రమాదానికి గురయ్యారు. తాడిపత్రి నుంచి కుంభమేళాకు ప్రైవేట్ ట్రావెల్ బస్సులో దాదాపు 40 మంది వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కాశీకి దాదాపు 30 కిలో మీటర్ల దూరంలో వారి బస్సును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొంది. దీంతో దాదాపు ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కడప రోడ్డులో ఉన్న శివాలయం నిర్వాహకుడు రంగస్వామి, బాలరంగయ్య దంపతులకు గాయాలైనట్లు తెలిసింది. క్షతగాత్రులను వారణాసి కలెక్టర్, ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

కార్మికుల సమస్యలపై అలసత్వం తగదు



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటైన శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై అధికారులు, ప్రభుత్వం అలసత్వం వహించడం తగదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అన్నారు. ఆదివారం ఆయన పీఏబీఆర్ డ్యాం వద్ద ఉన్న శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌ను సందర్శించారు. కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫేస్-4లో కళ్యాణదుర్గం , రాయదుర్గం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 6 నెలల జీతాలు, 30 నెలల పీఎఫ్ చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారానికై ఈ నెల 18 నుంచి కార్మికుంతా సమ్మెబాట పడుతున్నట్లు చెప్పారు.

కారు బోల్తా .. వ్యక్తికి గాయాలు

చెన్నేకొత్తపల్లి: అనంతపురం వైపు నుంచి బెంగళూరుకు వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన మైకేల్ ఫెర్నాండెజ్ మరో వ్యక్తితో కలసి అనంతపురము వైపు నుంచి బెంగళూరుకు కారులో వెళుతున్నారు. అయితే మండల పరిధిలోని ఉన్న ఫారెస్ట్ నర్సరీ వద్దకు రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న మైకేల్ ఫెర్నాండెజ్ గాయపడగా చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడి నుంచి అతను చికిత్స నిమిత్తం బెంగళూరు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



చిన్నారుల నృత్య ప్రదర్శన

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రమైన అనంతపురంలో నిర్వహిస్తున్న బాలోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఆదివారం నిర్వహించిన ముగింపు వేడుకల్లో జానపద గీతాలు, సందేశాత్మక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలతో విద్యార్థులు అలరించారు. పెద్ద సంఖ్యలో వీక్షకులు తరలిరావడంతో స్థానిక లలితకళాపరిషత్తు, గిల్డ్ ఆఫ్ సర్వీసు ప్రాంగణాలు కిటకిటలాడాయి. సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకల్లో ప్రతిభ చాటిన వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ చైర్‌పర్సన్ షమీమ్, ఆర్‌ఐఓ వెంటరమణనాయక్, నిర్వాహకులు సావిత్రి, లలితకళాపరిషత్తు కార్యదర్శి పద్మజ, బాలోత్సవం కార్యదర్శి శ్రీనివాసరావు, ట్రెజరర్ జిలాన్, తరిమెల అమరనాథరెడ్డి, సీనియర్ కవి నబీరసూల్, డాక్టర్ కొండయ్య, కత్తి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శన



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు